## క్లుప్తంగా

### సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాళ్ల టోకెన్లు అందిస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని మొత్తం 140 స్టాళ్లకు సోమవారం ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం బజార్ల రైతులకు స్టాళ్ల కేటాయించి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయించాలని సూచించారు. స్టాళ్లు ఉన్న రైతులు నేలమీద కూరగాయలు విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

### టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ



దీప్తిని అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: నగరంలోని ఎంఆర్‌ఎస్‌పీ టేబుల్ టెన్నిస్ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల పీజీ విద్యార్థిని ఎం.దీప్తి ప్రతిభ చూపి రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.మధుకుమార్ దీప్తిని అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

### నిందితుడికి రిమాండ్

సీతమ్మధార: మహిళను ప్రేమ పేరుతో నమ్మించి పెళ్లికి నిరాకరించిన వ్యక్తికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. దొండపర్తి మండావారిపేటకు చెందిన ఉమామహేశ్వరి భర్తతో విడాకులు తీసుకున్నారు. ఈమె మూడేళ్లుగా నగరంలోని డయోగ్నస్టిక్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో బంధువైన రవికుమార్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోమని ఆమె కోరాగా.. ఫోన్‌కు స్పందించకుండా దూరంగా పెట్టడంతో న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీంతో పోలీసులు రవికుమార్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరచగా.. 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ సత్యనారాయణ తెలిపారు.

### చందనోత్సవంలో బాలలకు సౌకర్యాలు కల్పించాలి

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే బాలలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. చిన్నారులకు వారి తల్లులు పాలు పట్టేందుకు వీలుగా క్యూల్లో తగినన్ని ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బాలలకు మంచి నీరు, వేడి పాలు, బిస్కెట్లు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన పిల్లలను త్వరితగతిన వారి తల్లిదండ్రులకు అప్పగించేలా పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌లైన్ సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు.

### కాలభైరవుడికి పూజలు



కాలభైరవస్వామికి అభిషేకం చేస్తున్న రాజాస్వామి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవస్థానంలో కొలువైన కాలభైరవ స్వామికి అష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెచ్చిన వడమాలను స్వామికి అలంకరించారు. భక్తులు గుమ్మడికాయల్లో నెయ్యి దీపాలు వెలిగించి పూజలు చేశారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతా, క్షీరాభిషేకాలు జరిపారు. ముందుగా గణపతి మహాస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన చలివేంద్రం



రేసపువానిపాలెం బస్ బే వద్ద జీవీఎంసీ చలివేంద్రం

# పేరుకే చలివేంద్రాలు..!






సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ముందు ఖాళీగా చలివేంద్రం

సీతమ్మధార: జీవీఎంసీ వెచ్చించే ప్రజాధనం కాంట్రాక్టర్ల పాలవుతోంది. ఇందుకు చలివేంద్రాల నిర్వహణే ఉదాహరణ. ఈ ఏడాది ఎండలు భగభగ మండిపోతున్నాయి. జనం బయట కాలు పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆలస్యంగా కళ్లు తెరిచిన జీవీఎంసీ అధికారులు తీరిగ్గా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పోనీ వాటిలో మజ్జిగ ఏమైనా ఇస్తున్నారా అంటే అదీ లేదు. ఒకటి కాదు రెండు కాదు.. రూ.2 వేల కోట్ల బడ్జెట్ గల జీవీఎంసీ అధికారులు, పాలకవర్గం మండువేసవిలో ప్రజలకు మజ్జిగ ఇచ్చిన పాపాన పోవడం లేదు. నగరంలో ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు, ఇతర సంఘాలు మజ్జిగ చలివేంద్రాలు నిర్వహించడం తెలిసిందే.

**ప్రజాధనం.. వృథా వ్యయం**

జీవీఎంసీ జోన్-3 అధికారులు ఖర్చు చేస్తున్న ప్రజాధనమంతా వృథాయేనని పలువురు ఘాటుగానే విమర్శిస్తున్నారు. ఈ చలివేంద్రాలకు జీవీఎంసీ వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. వీటిలో కాంట్రాక్టర్లు సిబ్బందిని నియమించారు. నగర వాసులు, ముఖ్యంగా విద్యార్థులు దాహం వేస్తే సోడా, కూల్ డ్రింక్, షరబత్, చెరుకురసం, మజ్జిగ, లస్సీ, జ్యూస్‌లు మాత్రమే తాగుతున్నారు. చలివేంద్రాల వద్ద నీరు తాగే ప్రజలను వేళ్లపై లెక్కించవచ్చంటే అతిశయోక్తి కాదు. జోన్-3 పరిధిలో 34 వరకు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఎంత వేతనాలు ఇస్తున్నారన్నది టాప్ సీక్రెట్ అంటే విస్తుపోవాల్సిందే. ఇదంతా కాంట్రాక్టర్ మాయాజాలమని పలువురు ఆరోపిస్తున్నారు.

ఈ మేరకు తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో జీవీఎంసీ జోన్-3 ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, రేసపువానిపాలెం, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, టీపీటీ కాలనీ, గురుద్వారా, అక్కయ్యపాలెం, ద్వారకానగర్, దొండపర్తి తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో కేవలం తాగునీరు మాత్రమే బాటసారులకు పంపిణీ చేస్తున్నారు.

**ఖాళీగా సిబ్బంది..**

జీవీఎంసీ చలివేంద్రాల్లో సిబ్బందికి పనిలేకుండా పోయిందనే చెప్పాలి. ప్రజలంతా వీటికి దూరంగా ఉంటున్నారు. మరోవైపు జ్యూస్ సెంటర్లు, చెరకు రసం, షరబత్ బండ్లు, పాన్‌షాప్‌ల వద్ద జనం అధిక సంఖ్యలో శీతల పానీయాలు సేవిస్తున్నారు. చలివేంద్రాలు ఎలా పనిచేస్తున్నాయన్నది పట్టించుకునే అధికారులే కరువయ్యారని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. సాయంత్రం సమయం ముగియగానే కుండల్లోని తాగునీటిని రోడ్డుపై పారబోయడం కనిపిస్తోంది. దీంతో మండు వేసవిలో జీవీఎంసీ వెచ్చించే ప్రజాధనం రోడ్డు పాలవుతోందని పలువురు వాపోతున్నారు.

**జూన్ నెలఖారు వరకు..**

జీవీఎంసీ ఆధ్వర్యంలో జూన్ నెలాఖరు వరకు చలివేంద్రాలు కొనసాగుతాయని జోన్-3 కమిషనర్ కె.శివప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

## సంకీర్తన పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విజేతలతో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు తదితరులు

సీతంపేట: శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన అన్నమాచార్య సంకీర్తన పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవం సోమవారం జరిగింది. ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి అవతార విశిష్టతను అన్నమాచార్యులు సంకీర్తనా రూపంలో భక్తులకు తెలియజేశారన్నారు. విద్యార్థులు సంగీతంతో పాటు చదువులోనూ రాణించాలని సూచించారు. శృతిలయ సంస్థ చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశంసించారు. అనంతరం ఆగమ పండితులు పి.రంగనాథ ఆచార్యులు, వీటెలీ బ్యూరో ఎంవిఎస్ఆర్ ప్రసాద్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. శ్రీసాయి కళానికేతన్, భువన గాయత్రి నృత్య శిక్షణాలయం విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, ప్రోగ్రాం కన్వీనర్ సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్ రెడ్డి, వి.నాంచారయ్య, పీవీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో 13.2 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసకుని, 13.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్ రామారావు, ఆర్పీఎఫ్ మహిళా ఎస్ఐ వి.కీర్తిరెడ్డి తమ సిబ్బందితో కలిసి సోమవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఢిల్లీ రాష్ట్రానికి చెందిన రేష్మాఖాన్, మొహమ్మద్ ఇబ్రాన్, వికాస్‌కుమార్‌లు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీకి గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని, రూ.66 వేల విలువైన 13.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

## మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

సీతమ్మధార: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొమ్మాది డ్రైవర్స్ కాలనీకి చెందిన పల్లంటి దేవి, తల్లి లక్ష్మితో కలిసి సోమవారం ఉదయం రామాటాకీస్ దరి ప్రభుత్వ కంటి ఆస్పత్రికి వచ్చారు. కంటి వైద్య పరీక్షల నిమిత్తం లోపలకు వెళ్లిన దేవి కనిపించలేదు. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. చేసేదేమీ లేక ద్వారకా పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పౌష్టికాహారంతో పిల్లలకు ఆరోగ్యం



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త గౌరి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త గౌరి మాట్లాడుతూ పిల్లల్లో ఊబకాయాన్ని ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల శారీరక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. లబ్ధిదారులు స్వయంగా పేర్లు నమోదు చేసుకునే విధానాన్ని వివరించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో మంగళవారం జరిగే పోషక పకోత్సవాల ముగింపు కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ విజయలక్ష్మి, ఏఎన్ఎం కృష్ణవేణి, పిల్లల తల్లిదండ్రులు, ఆయా కోమలి పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం హజ్ యాత్రికుల కోసం అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. హజ్ కమిటీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ, విజయనగరం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన 66 మంది యాత్రికులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు టీకాలు వేశారు. డాక్టర్ బి. లూసి కొర్జీలీయా (డీఐవో, విశాఖపట్నం), డాక్టర్ కె. ఎస్. రోష్ని (అసిస్టెంట్ ప్రొఫెసర్, కేజీహెచ్), డాక్టర్ ఎ. ఉషా (పిల్లల వైద్యులు), డాక్టర్ బి. ఎం. ప్రవీణ్య (స్త్రీల వైద్యులు), డాక్టర్ ఎస్. శ్రీనివాస్ (జనరల్ డాక్టర్), రైల్వే న్యూకాలనీ, నరసింహనగర్ యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, హజ్ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముగిసిన పాలిసెట్ శిక్షణ తరగతులు



శిక్షణలో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు



విద్యార్థికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న ద్వారకానాథ్

మురళీనగర్: మురళీనగర్ బాలభాను పాఠశాలలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. వీబీ పట్నాయక్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సమావేశంలో డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్ చేతుల మీదుగా శిక్షణలో పాల్గొన్న 60 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలభాను పాఠశాల ప్రిన్సిపాల్ టి.మనోరమణి, లక్ష్మి, క్లబ్ కార్యదర్శి పి.కమల, డి.శిరీష, ఎం.శేషామణి, కామేశ్వరి, ఎం.మహాలక్ష్మి, ఎస్.పూర్ణిమ పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల సంరక్షణలో భాగం కావాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మద్రిపాలెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెయ్యి రోజుల సంరక్షణ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. మద్రిపాలెం సెక్టార్ ఆధ్వర్యంలో 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన పోషణ పక్షోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి మాట్లాడుతూ పోషణ పఖ్వాడా కార్యక్రమం ఈ నెల 8 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో మద్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జె.ఎన్.టి.జ్యోతి, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు వేగవంతం



అధికారులకు సూచనలు చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాఖ సిటీ: మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, వాణిజ్య సముదాయ భవనం, హెలీకాప్టర్ మ్యూజియానికి సంబంధించిన అన్ని పనులను ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వాటిని ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఈ రెండు ప్రాజెక్టులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన పనులు ఏమైనా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు, ఈఈలు మధుసూదన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులతో అవస్థలు

- రోడ్లు, డ్రైనేజీల పేరిట ఇష్టానుసారంగా తవ్వకాలు
- రైల్వే న్యూకాలనీ, దొండపర్తి వాసులకు తప్పని ఇబ్బందులు



దొండపర్తి జంక్షన్‌లో ఒకవైపు రోడ్డు మొత్తం బ్లాక్‌చేసి చేపట్టిన పనులు



రైల్వే న్యూకాలనీ మసీదు సెంటర్‌లో కల్వర్టు పనుల నిమిత్తం తవ్వేసిన రోడ్డు



మసీదు సెంటర్‌లో వాటర్ పైప్‌లైన్ నిమిత్తం రోడ్డును తవ్వుతున్న కార్మికులు

తాటిచెట్లపాలెం: అభివృద్ధి పనుల పేరిట ఇష్టానుసారంగా రోడ్లు తవ్వేయడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జీవీఎంసీ 41, 42 వార్డుల్లోని రైల్వే న్యూకాలనీ, దొండపర్తి ప్రాంతాల్లో ప్రధాన రహదారులను సైతం తవ్వేయడంతో వాహన చోదకులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వే న్యూకాలనీ మెయిన్ రోడ్డులో కొంత కాలంగా రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. మసీదు సెంటర్‌లో డ్రైనేజీ పనుల నిమిత్తం జీవీఎంసీ సిబ్బంది సగం రోడ్డును తవ్వారు. ఈ పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. దీంతో రాత్రి వేళల్లో చిన్నారులు, వృద్ధులు ఏ ప్రమాదాలకు గురవుతారోననే భయంతో స్థానికులు గడుపుతున్నారు. ఈ రోడ్డులో ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు తవ్వడం, డ్రైనేజీ పనులు నిర్వహించడంతో ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు తెలియజేస్తున్నారు. ఇప్పటికే ఒక రోడ్డు సగం తవ్వేయగా.. ఇదే జంక్షన్‌లో సోమవారం ఉదయం నుంచి మరో రోడ్డును కూడా బ్లాక్ చేయడంతో చుట్టూ తిరిగి పనులకు, విధులకు వెళ్లాల్సి వచ్చిందని, కనీసం ముందస్తు సమాచారం కూడా లేకుండా తాగునీటి సరఫరా విభాగం వారు ఈ రోడ్డును బ్లాక్ చేశారని కాలనీవాసులు మండిపడ్డారు.

**దొండపర్తి మెయిన్ రోడ్డులో నత్తనడకన..**

దొండపర్తి జంక్షన్‌లోని సిగ్నల్స్ వద్ద ఒక వైపు పూర్తిగా డ్రైనేజీ పనుల నిమిత్తం తవ్వేశారు. ఇక్కడ పనులు జరుగుతున్నా.. నత్తనడకన సాగుతున్నాయని, ఈ కారణంగా ఈ కూడలిని దాటాలంటే ఇటు రైల్వే న్యూకాలనీ లేదా సంగం శరత్ థియేటర్ జంక్షన్ వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోందని వాహన చోదకులు వాపోతున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

**వాహన చోదకులకు ఇక్కట్లు**

దొండపర్తి జంక్షన్‌లో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తిన్నగా వెళ్లాల్సిన మేము చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. సమయం వృథా అవుతుంది. ఇటువంటి ప్రధాన కూడలిలో ఒకేసారి మొత్తం రోడ్డును బ్లాక్ చేస్తే ఎలా?. త్వరగా పనులు పూర్తిచేయాలి.

– పి.శరత్‌కుమార్, అక్కయ్యపాలెం

**రోడ్లు తవ్వేస్తే.. రాకపోకలెలా?**

రైల్వే న్యూకాలనీలో కొన్ని నెలలుగా ఏవో పనులతో రోడ్లను తవ్వేస్తున్నారు. డ్రైనేజీ పనుల నిమిత్తం శివాలయం రోడ్డులో చాలా కాలం పనులు చేపట్టారు. ఇప్పుడు మసీదు సెంటర్‌లో మళ్లీ కల్వర్టు పనుల నిమిత్తం రోడ్డు తవ్వేశారు. సోమవారం మెయిన్ రోడ్డును కూడా బ్లాక్ చేశారు. ఇలాగైతే రాకపోకలు సాగించలేం.

– ఎం.ఆనంద్‌బాబు, రైల్వే న్యూకాలనీ

## ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న జోన్-5 కమిషనర్ రాము



తహసీల్దార్ రమేష్‌కు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మూడు వినతులు అందినట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు 2, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున పలువురు అర్జీలు సమర్పించారన్నారు. వినతులను జెడ్సీ పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, భరణి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పీజీఆర్ఎస్‌కు 10 వినతులు**

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు స్థానికులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత, వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సీతమ్మధార: లిటిల్ ఏంజిల్స్ స్కూల్ యాజమాన్యం అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ప్రైవేట్ కాలేజెస్, స్కూల్స్, స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో తొలగించిన కార్మికులతో కలసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలగించిన 15మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని లేబర్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను యాజమాన్యం పట్టించుకోవడం లేదని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. పాఠశాల యాజమాన్యం తీరుకు నిరసనగా కార్మికులు నినాదాలు చేశారు.